ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



పనులు ప్రారంభిస్తున్న మధుయాష్కీగౌడ్

హస్తినాపురం: ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. హస్తినాపురం డివిజన్ సప్తగిరిహిల్స్ కాలనీలో రూ.65 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా అధికారంలో ఉన్నవాళ్లు నియోజకవర్గం అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో నిధులు మంజూరుచేసి అభివృద్ధి చేస్తుంటే రాజకీయాలు చేస్తూ అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల కబ్జాలు, ఆక్రమణలతోనే ఇన్నాళ్లు పాలన సాగించిన కొందరు నాయకులు అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. గతంలో సప్తగిరిహిల్స్ కాలనీ వాసులకు రోడ్లు, డ్రైనేజీ కోసం అడిగితే నిధులను మంజూరు చేయకుండా ప్రజాప్రతినిధులం అని చెప్పుకునే నాయకులు ఇబ్బందులు పెట్టారని కానీ తమ ప్రభుత్వం కాలనీల్లోని సమస్యలు తీర్చేందుకు నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, నాయకులు శశిధర్‌రెడ్డి, నర్సింహ్మాయాదవ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, డేరింగుల కృష్ణ, దాము మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసి.. అర్ధంతరంగా వదిలేసి

- అభివృద్ధికి దూరంగా సత్యానగర్ కాలనీ
- నిలిచిపోయిన ఫుట్‌పాత్, సెంట్రల్ డివైడర్ పనులు
- అవస్థలు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

నాగోలు: నగరం నడిబొడ్డులో ఉన్న కాలనీ ఇప్పటికి సరైన అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాలనీలో కావాల్సిన మౌలిక సదుపాయలు కల్పించాల్సిన జీహెచ్‌ఎంసీ, ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో కాలనీ అభివృద్ధికి దూరంగా ఉంటుంది. జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ పరిధి కొత్తపేట డివిజన్ సత్యానగర్ కాలనీలో అనేక సమస్యలు వేధిస్తున్నాయి. సత్యానగర్ కాలనీలో ప్రధాన రహదారి విస్తరణ, ఫుట్‌పాత్ నిర్మాణం, సెంట్రల్ డివైడర్ అభివృద్ధి కోసం 2020లో రూ. 30.50 లక్షలతో నిర్మించే పనులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాటి కార్పొరేటర్ జీవీ.సాగర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్లు కాలనీలో సీసీ రోడ్డు మాత్రమే వేసి పనులు మధ్యలోనే వదిలేశారు. పాత విద్యుత్ స్తంభాలు తొలగించకుండా కొత్తగా తెచ్చిన స్తంభాలు రోడ్డు మధ్యలోనే వదిలేశారు. రాత్రి సమయంలో కాలనీ వాసులు రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలకు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే అనేక మంది కిందపడి గాయాలపాలయ్యారు. మధ్యలోనే నిలిపోయిన పనులు పూర్తి చేయాలని కాలనీవాసులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.



రోడ్డు మధ్యలో ప్రమాదకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

ఐదేళ్ల క్రితం ప్రారంభం..

దాదాపు ఐదు సంవత్సరాలైన సత్యానగర్‌లో ప్రధాన రహదారి విస్తరణ, ఫుట్‌పాత్ నిర్మాణం, సెంట్రల్ డివైడర్ అభివృద్ధి చేయకపోవడంతో కాలనీ రోడ్డు మధ్యలో ఉన్న స్థలాన్ని కాలనీ వాసులు, వ్యాపారులు తమ వాహనాలను రోడ్డు మధ్యలోనే పార్కింగ్ చేస్తున్నారు. ఓ పక్క విద్యుత్ స్తంభాలు..మరో పక్క అక్రమ పార్కింగ్‌తో కాలనీలో నడవలేని దుస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పాఠశాల బస్సులు వచ్చే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సత్యానగర్ కాలనీ మూసీ సమీపంలో ఉండడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సత్యానగర్ కాలనీలో రోడ్డు సెంట్రల్ డివైడర్ నడుమ అక్రమ పార్కింగ్



అభివృద్ధికి నోచుకోని సత్యానగర్ కాలనీ ప్రధాన రహదారి

అధికారుల కాలయాపన..

రోడ్డు మధ్యలోనే వేసిన విద్యుత్ స్తంభాలు వెంటనే అక్కడ నుండి తీసి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. గత ఐదేళ్ల నుంచి అధికారులతో మొర పెట్టుకుంటున్నా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాలనీలో జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కును నిర్మాణం చేశారు కానీ పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందని వాపోతున్నారు. కాలనీలో ప్రతిరోజూ డ్రైనేజీ మురుగు పొంగుతుందని ఉన్నతాధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: మరమ్మతుల పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సుల్తానాఅల్వా 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని కటకోనికుంట, చంపాపేట పాతబస్తీ, సాయిరాం నగర్, సుల్తానాఅల్వా, బస్తీ దవాఖానా పరిధి, రాజిరెడ్డినగర్ కాలనీలలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని అధికారులు తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమోటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.21, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.26, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.35, చామగడ్డ రూ.43, మునగ రూ.65, కందగడ్డ రూ.70, బీట్‌రూట్ రూ.23, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

24, 25 తేదీల్లో ప్రవచన కార్యక్రమాలు

వనస్థలిపురం: మహా శివరాత్రి సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ వైదేహినగర్‌లోని వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో 2 రోజుల ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 24న సాయంత్రం 6 గంటలకు జయశ్రీచే శివ మహిమలు, 25న సాయంత్రం 6 గంటలకు చెరువు హరి పినాకపాణి శర్మచే రుద్రాభిషేక వైభవం ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

అల్మారా వితరణ



నాగోలు: జైపురికాలనీ ప్రాథమిక పాఠశాలకు కాలనీ చెందిన గుండ సోమయ్య పాఠశాల బీరువా కోసం రూ.10 వేలు ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ..దాతలు పాఠశాల అవసరాలకు వస్తు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత రెడ్డి,మేరీ బ్యూల, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన కులాలకు పెద్దపీట

మన్సూరాబాద్: వెనుకబడిన కులాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్‌లో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన పలు కాలనీల్లో పర్యటించి కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలను తక్కువగా చూపిస్తూ దొంగ లెక్కలు చూపించారన్నారు. వివిధ ప్రజా సంఘాలు, సామాజిక వేత్తలు, మేధావుల అభిప్రాయాల మేరకు కులగణ సర్వే చేపటడం జరుగుతుందన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న రాపోలు జయప్రకాష్

భక్తిశ్రద్ధలతో ప్రత్యంగిరా దేవి ఆలయ బ్రహ్మోత్సవాలు



ప్రత్యంగిరా దేవికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు



మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న మునిపల్లె శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళ పీఠం ప్రత్యంగిరా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యంగిరా అమ్మవారికి అన్నాభిషేకం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ప్రత్యంగిరా దేవికి నిర్వహించిన మహా నక్షత్ర హారతులు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, మల్‌రెడ్డి రాంరెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, మునిపల్లె సువర్ణ లత, విఠల్ శర్మ, హేమంత్ శర్మ, శ్రీపతి, అన్నపూర్ణ, హేమ, దేవి, హిమబిందు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

ఉప్పల్: పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఉప్పల్ కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సెంటర్ నిర్మాణ పనులను కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. నియోజవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. చిరు వ్యాపారుల చిరకాల వాంఛ అయిన కమ్యూనిటి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తనకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగూర్ బాషా, ఫీరంబి, అల్లాభాషా, ఖాజా మౌలానా, మల్లికార్జున్, నవీసాబ్, శ్రీను, ఖాధర్, సిద్దయ్య, తుమ్మల దేవి రెడ్డి, ఈగ అంజయ్య, తెల్కల మోహాన్ రెడ్డి, మంద మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాలులో ఎలాంటి నాలా లేదు

ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనంద్‌రెడ్డి

బడంగ్‌పేట్: పెద్దబావి మల్లారెడ్డి ఫంక్షన్‌హాలును ఎలాంటి నాలాను ఆక్రమించి నిర్మించలేదని, కబ్జాలు చేసి నిర్మించారన్న విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పెద్దబావి ఆనంద్‌రెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేటలోని గార్డెన్‌లో నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2007లో జీపీ అనుమతితో మల్లారెడ్డి పేరుతో ఫంక్షన్‌హాల్ నిర్మించి 2009లో ప్రారంభించామన్నారు. గాంధీనగర్ దగ్గర ఉన్న తుర్కదానికుంట నుంచి వరదనీరు, వాననీరు పొలాల గుండా పారుతూ బడంగ్‌పేట్ ప్రధాన రహదారిలో నిర్మించిన కల్వర్టు కింద మత్తడి దాటుతూ కాశీబుగ్గ ఆలయం మీదుగా శివనారాయణపురం కాలనీ దాటుతూ పెద్ద చెరువుకు చేరుకునేది. ఈ కాలువ చాలా సంవత్సరాలు కొనసాగింది. రెండేళ్ల క్రితం వరద కాలువను మట్టితో నింపేయడం కారణంగా ఈ సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. ఆ వరద కాలువను బీజేపీ నాయకులు మట్టిపోసి మూసివేశారని ఆరోపించారు. శివసాయినగర్ కాలనీకి చెందిన సెప్టిక్‌ట్యాంక్‌ను కూడా బీజేపీ నాయకులు మట్టితో మూసివేయడంతో కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 20 ఏళ్ల క్రితం సైకిల్‌పై పాలు అమ్మిన అందెల శ్రీరాములు కల్వర్టు మీద నుంచి రోజు వచ్చేవాడన్న సంగతి మరిచిపోయాడా అని నిలదీశారు. బీజేపీ నాయకులే మట్టిని పోసి, తిరిగి వారే ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. నాలాకు ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేకున్నా బట్ట కాల్చి మీద వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలాపై ఫంక్షన్‌హాలు నిర్మించారని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. అందుకు సంబంధించిన లేటెస్ట్ శాటిలైట్ల చిత్రాలను చూపించారు. అందెల శ్రీరాములు జాగ్రత్తగా మాట్లాడటం నేర్చుకోవాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే సబితారెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

సెక్షన్ 106ను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

హయత్‌నగర్: డ్రైవర్ల పాలిట శాపంగా మారిన భారతీయ న్యాయ సంవిధాన్ సెక్షన్ 106(1), (2)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్డులో ఆటో డ్రైవర్‌లు ఆందోళన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. సెక్షన్ 106 అభద్రతా భావంతో డ్రైవర్‌లు ఆవేదన చెందుతున్నారని, ఈ సెక్షన్‌ను రద్దు చేసి రవాణా వ్యవస్థను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు యూనియన్ సిల్లా అధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. బుధవారం హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో డీసీ తిప్పర్తి యాదయ్య, ఈఈ ఆశలతతో కలిసి ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



కాలనీలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, అధికారులు



శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



జడ్జెస్‌కాలనీలో శివాజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జై భవానీ.. జై శివాజీ

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో శోభాయాత్ర నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. – ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్లబృందం



ఎన్టీఆర్‌నగర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎల్‌బీనగర్ సీఐ వినోద్‌కుమార్



చింతలకుంట వాసవి శ్రీనిలయంలో శివాజీ జయంతి వేడుకలో పాల్గొన్న జిడ్డి మురళీమోహన్



శివాజీ జయంతి వేడుకలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు



శివాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



శివాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి



నాగోలులో వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ